క్లుప్తంగా

జిల్లా జడ్జికి న్యాయశాఖ ఉద్యోగుల సత్కారం



జిల్లా జడ్జికి శుభాకాంక్షలు చెబుతున్న న్యాయశాఖ ఉద్యోగులు

చిత్తూరు అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన అరుణ సారికను జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరు న్యాయస్థానాల సముదాయంలో జడ్జిని కలిసి, దుశ్శాలువతో సన్మానించి స్వాగతం పలికారు. న్యాయశాఖ ఉద్యోగుల రాష్ట్ర నాయకులు గోపినాథ్‌రెడ్డి, నాయకులు గిరిధర్‌రెడ్డి, లక్ష్మీపతి, గణేష్, బాలసుందర్, రవీంద్రరెడ్డి, రాజేష్, హరికృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, సంతోష్, దిలీప్, యువరాజ్, రెడ్డెప్ప, చంద్రశేఖర్, పవనకుమారి, భ్రమరాంబ, హేమ, మినిమా రాయల్ తదితరులు జిల్లా జడ్జిను కలిశారు.

పార్థసారథి సేవలు ప్రశంసనీయం



తుంబకుప్పంలో పార్థసారథి దంపతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

బంగారుపాళెం: తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పార్థసారథి సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ అమరావతి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. ఈ నెల 30న పార్థసారథి ఉద్యోగ విరమణ పురస్కరించుకుని శుక్రవారం పాఠశాలలో రిటైర్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 35 ఏళ్లుగా విద్యారంగానికి పార్థసారథి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పార్థసారథి దంపతులకు సహోపాధ్యా యులు, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు, పలువురు ప్రజాప్రతినిధులు శాలువలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లీలావతమ్మ, ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు దత్తాత్రేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20న సాంస్కృతిక ప్రదర్శన

చిత్తూరు రూరల్(కాణిపాకం): ప్రజాహిత సేవ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న 101వ సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు రాజరత్నంరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం మిట్టూరులోని రెవెన్యూ భవనంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. పోటీల్లో గెలుపొందే వారికి బహుమతులు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

నేడు చిత్తూరులో వీహెచ్‌పీ నిరసన

చిత్తూరు అర్బన్: పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ శనివారం చిత్తూరు నగరంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) సభ్యులు వడివేలు తెలిపారు. గాంధీ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు భజరంగ్‌దళ్‌తో కలిసి నిరసన వ్యక్తం చేసి, ఆపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

తుంబకుప్పం వీఆర్‌ఏ దుర్మరణం



సుధాకర్ (ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పం రెవెన్యూ సుధాకర్ అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. సుధాకర్ మూడు రోజుల క్రితం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తుంబకుప్పంలో సుధాకర్ భౌతికకాయాన్ని శుక్రవారం స్థానిక రెవెన్యూ అధికారులు, వీఆర్‌ఏలు, స్థానిక ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. వీఆర్‌ఏగా సుధాకర్ చేసిన సేవలకు గుర్తు చేశారు.

కనుమరుగవుతున్న చేతిపంపులు



మందిక్రిష్ణాపురంలో పనిచేయని చేతిపంపు

గుడిపాల మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి చేతిపంపులు నిరుపయోగంగా ఉన్నాయి. మండల వ్యాప్తంగా గతంలో 160 చేతిపంపులు ఉండేవి. ఇప్పుడు కొన్ని గ్రామాల్లో 80వరకు మాత్రమే పనిచేస్తున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతోనే అనేక గ్రామాల్లో చేతి పంపులు పనిచేయడం లేదన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న వాటిలో కూడా అరకొరగా నీళ్లు వస్తున్నాయని, అవి కూడా ఎప్పుడు ఆగిపోతాయో తెలియదని ప్రజలు వాపోతున్నారు. పనిచేయని చేతిపంపులు మరమ్మతులకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – గుడిపాల





నరహరిపేటలో మరమ్మతులకు నోచుకోని చేతిపంపు, వసంతాపురంలో పనిచేయని చేతిపంపు

తస్మాత్ జాగ్రత్త !

- తాళం వేసిన ఇళ్లపై పోలీసుల నిఘా
- అప్రమత్తతతోనే వేసవి చోరీల నివారణ
- అదును కోసం వేచి చూస్తున్న దొంగలు
- ప్రయాణించే ముందు పోలీసులకు సమాచారం తప్పనిసరి



గుడిపాల: వేసవి సెలవులు రాబోతున్నాయి. అయితే ఇంటిల్లిపాదీ దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేసే ముందు ఒక్కసారిగా వేసవిలో జరిగే దొంగతనాలపై అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఈ రెండు నెలలు పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో దొంగతనాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ముఖ్యంగా తాళాలు వేసి ఆరుబయట నిద్రించే వారి ఇళ్లపై దొంగలు నిఘా వేసి సొత్తును కొల్లగొట్టేందుకు పక్కాగా స్కెచ్ వేస్తారు. అయితే అటువంటి దొంగతనాలు జరగకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ పోలీసులు అందజేసే సూచనలు పాటించాలని పోలీస్‌సిబ్బంది చెబుతున్నారు.

వేసవిలో దొంగతనాలపై జాగ్రత్త

వేసవి సెలవుల్లో వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు వెళ్లే వారు ముందస్తుగా పోలీసులకు సమాచారం అందజేయాలి. పట్టణంలో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే తక్షణమే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం చేరవేయాలి. వేసవిలో ఉక్కపోతతో ఇళ్లల్లో ఉన్నవారంతా ఆరుబయట నిద్రించేందుకు ఆసక్తి చూపుతారు. అటువంటి వారి ఇళ్లల్లో వీలైన మేరకు విలువైన వస్తువులను బ్యాంకుల్లో భద్రపరిస్తే మంచిది. మెరుగు పేరుతో ఎవరైనా సంచరిస్తే వారి వలలో చిక్కుకుని మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో గస్తీలు నిర్వహించే పోలీస్ సిబ్బందికి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలి. గ్రామాల్లో యువత అప్రమత్తంగా వ్యవహరించి, ఎటువంటి సంఘటనలు జరిగినా తక్షణమే పోలీసులకు తెలియజేసే విధంగా సేవలు అందజేయాలి.

సమాచారంలో ఇళ్లు భద్రం

వేసవిలో కుటుంబం మొత్తం 2, 3 రోజులకంటే ఎక్కువ కాలం ప్రయాణాలకు వెళ్లేవారు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందజేస్తే, ఆ ఇంటికి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన భద్రత అందజేస్తారు. ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్) సదుపాయంతో పూర్తి స్థాయిలో నిఘా వేస్తారు.

అప్రమత్తంగా ఉండాలి



వేసవిలో జరిగే దొంగతనాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ ఎటువంటి సంఘటన జరిగినా తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వేసవి సెలవుల్లో క్యాంపులకు వెళ్లే వారంతా ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవచ్చు. ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే 94407 96712కు సమాచారం అందించాలి.

– రామ్మోహన్, ఎస్‌ఐ, గుడిపాల

పనిచేసే విధానం ఇలా

స్మార్ట్‌ఫోన్ ఉన్న ఇంటి యజమానులు ముందుగా ప్లేస్టోర్‌నుంచి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దీంతో 6 అంకెల కోడ్ నంబర్ సంబంధిత యజమానికి వస్తుంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి పూర్తి వివరాలు నేరుగా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరుతాయి. ప్రయాణాలకు వెళ్లే సమయాల్లో ముందురోజు 6 అంకెల డిజిట్ కోడ్‌ను రిక్వెస్ట్ పోలీస్‌వాచ్ ఆప్షన్‌లో నమోదు చేసుకుంటే, సమీప పోలీస్ సిబ్బంది ఆయా ఇంటికి వెళ్లి ఎల్‌హెచ్‌ఎంఎస్ పరికరాలను అమర్చుతారు. దీంతో ఆ ఇళ్లు పూర్తిగా పోలీస్ విభాగం కంట్రోల్‌కు చేరుతుంది. ఇంట్లో ఎవరూ లేని సమయాల్లో ఆగంతకులు ప్రవేశిస్తే నేరుగా కంట్రోల్‌రూమ్ వద్ద ఉన్న అలారం మోగుతుంది. దీంతో స్థానిక పోలీసులు అప్రమత్తమై ఆ ఇంటికి చేరుకుంటారు. ఈ విధంగా ఇంటికి భద్రత ఏర్పడుతుంది. అంతేగాకుండా దొంగతనాలను పూర్తిగా నిరోధించవచ్చని పోలీసులు చెబుతున్నారు.

పంట పొలాల్లో కరెంటు పెడితే చర్యలు

ఐరాల: మండలంలోని అటవీ ప్రాంత సరిహద్దు గ్రామాల్లో పంటలకు రక్షణగా వన్యమృగాలను వేటాడటానికి అక్రమంగా విద్యుత్ తీగలు అమరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల అటవీశాఖ అధికారి(డీఆర్‌ఓ) రాకేష్ కుమార్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. అటవీ ప్రాంత సరిహద్దు పొలాల్లో అడవి జంతువుల వేటకు సంబంధించి పొలాల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చడం, ఉచ్చులు వేయ డం, నాటు బాంబులు పెట్టడం, విషప్రయోగం వంటివి అటవీ చట్టరీత్యా నేరమని సూచించారు. పంట పొలాల్లో విద్యుత్ తీగలు అమర్చడంతో పొలాలకు వెళ్లే రైతులు ప్రాణాలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఈ దుశ్చర్యలకు పాల్పడితే యావజ్జీవ కారాగార శిక్ష పడే అవకాశం ఉందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చితే 9440268691 సమాచారం అందించాలని ఆయన కోరారు.

బాణసంచా గోదాముల తనిఖీ

కార్వేటినగరం : మండలంలోని బాణసంచా గోదాములను డీఎస్పీ సయ్యద్ అహ్మద్ అజీజ్ శుక్రవారం తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ పిల్లలకు బాణసంచా అందుబాటులో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గోదాముల వద్ద ఇసుక బక్కెట్లు, ధూమపాన నిషేధ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

విజయకృష్ణారెడ్డి సేవలు ప్రశంసనీయం





విజయకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం, మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

తవణంపల్లె: ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతతో పని చేస్తూ, స్థానిక హైస్కూల్ అభివృద్ధికి ఎనలేని సేవలందించిన విజయకృష్ణారెడ్డి సేవలు ప్రశంసనీయమని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి కొనియాడారు. హెచ్‌ఎం దేవరాజులు రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనకు ఉద్యోగ విరమణ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. దీనికి విచ్చేసిన డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవితోపాటు పలువురు వక్తలు విజయకృష్ణారెడ్డి సేవలను కొనియాడారు. ఆయన ఉపాధ్యాయ సంఘ సేవకుడిగా అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన శేషజీవితాన్ని సంతోషంగా ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎఎం గిరిప్రసాద్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి, మండల పీఆర్‌టీయూ అధ్యక్షులు బాలచంద్రారెడ్డి, ఎంఈఓలు త్యాగరాజుల రెడ్డి, విశ్రాంత ఎంఈఓలు లోకనాథ పిళ్లై, హేమలత, జి.ప్రభాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, హెచ్‌ఎంలు మోహన్‌రెడ్డి, ప్రకాష్‌బాబు, శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైల్వే పనుల్లో జాప్యంపై సీఈ ఆగ్రహం

చిత్తూరు కార్పొరేషన్: అమృత్ భారత్ పథకం కింద రైల్వేస్టేషన్‌లో రూ.14 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. వీటిని పర్యవేక్షించడానికి శుక్రవారం చిత్తూరుకు ఆ శాఖ స్టేషన్ డెవలప్‌మెంట్ విభాగం సీఈ మల్లికార్జున వచ్చారు. పరిసరాలను, పనులను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. పనులు ఎందుకింత ఆలస్యమవుతోందని అధికారులు, కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. ఇలాగే ఉంటే ఎప్పుడు పూర్తి చేస్తారు అని ప్రశ్నించారు. దాదాపు ఒకటిన్నర సంవత్సరం పైగా పనులు చేస్తున్నారు. ఇంక 50 శాతం కూడా పనులు కాలేదని చెప్పారు. సగంసగం పనులతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవు అని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల ప్లాన్ చూసి పలు సూచనలు చేశారు. రెండో ప్లాట్‌ఫారంలో పెయింట్ పనులు చేయాలని సూచించారు. దివ్యాంగులు ఉపయోగించే టాయిలెట్స్ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. వారికి ఉపయోగంగా కొళాయిలు, డోర్, ఫ్లోర్ ఏర్పాటు చేయాలన్నారు. స్టేషన్‌ను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులకు నిర్మించనున్న గదుల ప్లాన్ సౌకర్యంగా లేవని వారు ఫిర్యాదు చేశారు. అంత చిన్న గదుల్లో ఉద్యోగులు అందరూ పట్టరాని, విధులు నిర్వహించడం కష్టతరమని చెప్పారు.



స్టేషన్‌లో పనులు పరిశీలిస్తున్న సీఈ మల్లికార్జున



సమస్యలు వివరిస్తున్న పోలీసులు

రోడ్డును కమ్మేసిన డ్రిల్లింగ్



భూగర్భజలాలు అడుగంటి వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయి. దీంతో సాగునీటి కోసం రైతులు కొత్త బోర్లు వేస్తున్నారు. పలమనేరు-కుప్పం రహదారి పక్కన రైతు తన పొలంలో శుక్రవారం బోరు డ్రిల్లింగ్ పనులకు పూనుకున్నాడు. 800 అడుగులు డ్రిల్ చేసినా చుక్క నీరు రాకపోగా దుమ్ములేచింది. ఆ దుమ్ము రోడ్డుపై కమ్ముకోవడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనాల డ్రైవర్లకు రోడ్డు కనిపించకుండా పోయింది. దీంతో వాహనాలను ఆపి మెల్లగా పోవాల్సి వచ్చింది. హైవేల సమీపంలో బోర్లను డ్రిల్ చేసేవారు పొగ రాకుండా ఫోం డ్రిల్లింగ్ లేదా నీటితో నానుస్తూ డ్రిల్ చేయాల్సి ఉంది. అయితే చేయకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఎదురవుతోంది.

– పలమనేరు

కూటమి నేతల కుమ్ములాట

- చిత్తూరులో రోడ్డుపైనే కొట్టుకున్న రెండు వర్గాలు
- పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ
- నచ్చచెప్పి పంపించిన పోలీసులు

చిత్తూరు అర్బన్: కూటమి నేతల వర్గపోరు బజారు నపడింది. పనుల్లో లుకలుకలు మొదలై ఇరువర్గాలు రోడ్డుపైనే కొట్టుకున్నాయి. పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకునే పరిస్థితి వచ్చింది. గ్రామస్తుల కథనం మేరకు, చిత్తూరు నగరంలోని ఎల్‌బీపురం(వేపనపల్లి)లో కూటమి నేతలు రెండు వర్గాలుగా ఏర్పడ్డారు. సూరి నాయుడు, గిరినాయుడు, నాగార్జున నాయుడు ఒకవర్గంగా మధునాయుడు, మోహన్‌నాయుడుతో పాటు మరి కొందరు మరోవర్గంగా కొనసాగుతున్నారు. ఈ మధునాయుడు వర్గానికి నరిగపల్లి (12వడివిజన్)కి చెందిన శీను అండదండలు ఉన్నాయి. ఇతను పార్టీలో బలంగా రాణిస్తూ 11వార్డులో కూడా శాసిస్తుంటాడని వాళ్ల వాదన. బోర్లు డ్రిల్ చేయించడం, సీసీ రోడ్డు వేయడం వంటి పనులు శీనునే ముందుండి చేస్తుంటాడు. ఇక గురువారం రాత్రి ఎల్‌బీపురంలో ఇరువర్గాలు పార్టీ పదవులపై పంచాయితీకి దిగాయి. ఈ తరుణంలో నాగార్జున నాయుడు మాట్లాడుతూ తాను పార్టీకి కష్టపడి పనిచేశాను.. ఇంతవరకు తగిన గుర్తింపు లేదంటూ..అసంతృప్తి సెగలు కక్కినారు. ఈ సమయంలో అదే దారిన వెళుతున్న కార్లో శీను తళ్లుక్కుమన్నాడు. వెంటనే నాగార్జున వర్గం శీను కారును వెంబడించింది. అయితే ఈ క్రమంలో బండపల్లికి చెందిన నేతకు ఫోన్ చేసి జరిగిన సంఘటనను వివరించారు. దీంతో ఆ నేత తన అనుచరులను నాగార్జున వర్గం వెంట పంపి జీకే పురం వద్ద కనిపించిన శీనుతో వాగ్వాదానికి దిగారు. అక్కడ మాటామాటా పెరగడంతో నాగర్జున వర్గం శీనుతో పాటు అతనితో ఉన్న వారిని చితకబాదారు. కొంత సేపటికి ఎల్‌బీపురంలో అల్లర్లు చెలరేగాయి. శీను, మధునాయుడు వర్గం కలిసి నాగార్జున వర్గంపై గొడవకు దిగారు. ఇరువర్గాలు కొట్టుకున్నాయి. వెంటనే రెండు వర్గాలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నాయి. అయితే ప్రజాప్రతినిధులు, పార్టీ పెద్దలు ఇరువర్గాలను సర్దుబాటు చేసి పంపినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.





శిలువతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చివీధిలోని టౌన్ చర్చి, బీటీ మెమోరియల్ చర్చి, జాన్‌బాస్కో చర్చి తదితర చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ఆరాధన కార్యక్రమాలు చేపట్టారు. క్రైస్తవులు ఉదయాన్నే చర్చిలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. ఏసు గీతాలను ఆలపించారు. ముఖ్య బోధకులు బైబిల్ చదివి వినిపించారు. శిలువపై ఏసు పలికిన ఏడు బంగారు మాటలను వివరించారు. టౌన్‌చర్చి పాస్టర్ రెవరెండ్ డాల్విన్ క్రిస్టియన్ దాస్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జీసెస్ సందేశాన్ని భక్తిశ్రద్ధలతో ఆలపించారు. గుడ్ ఫ్రైడే విశిష్టతను వివరించారు. క్యాండిల్ వెలిగించి ప్రార్థనలతో ఏసుప్రభువును కొలిచారు. విశ్వాసులు తమ దీక్షలను విరమించారు. పలువురు ప్రభువు శిలువ వేసే వేషధారణలతో ఆకట్టుకున్నారు. ప్రధాన రహదారి గుండా ఏసు క్రీస్తు శిలువను మోసుకుంటూ ర్యాలీ చేపట్టారు. క్రీస్తు శిలువ వృత్తాంతాన్ని వివరిస్తూ ఈ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీకి క్రైస్తవులు భారీగా తరలివచ్చారు. అన్ని చర్చిలు క్రైస్తవులతో కిటకిటలాడాయి.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

బంగారుపాళెం: యేసుప్రభువు శిలువ అయిన శుక్రవారం రోజు మండలంలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని ప్రధాన చర్చిలు రోమన్‌క్యాథలిక్, సీఎస్ఐ చర్చిలతో పాటు మండలంలోని బంగారుపాళెం, తగ్గువారిపల్లె, నలగాంపల్లె, కరిడివారిపల్లె, బండ్లదొడ్డి, మాధవనగర్ తదితర గ్రామాల్లో ఉదయం నుంచి ప్రార్థనలు చేపట్టారు. మాధవనగర్‌లోని బ్లసింగ్ చర్చిలో పాస్టర్లు కిరణ్‌జాన్‌పాల్, యోహాన్ దేవుని సందేశాన్ని, సూక్తులను బోధించారు.



టౌన్‌చర్చిలో ప్రసంగిస్తున్న డాల్విన్ క్రిష్టియన్‌దాస్



ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు